
# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ ఆదివారం | 12 ఏప్రిల్ 2026 | ■ 10 పేజీలు

- ■ అటు మద్దతు ధర లేదు.. ఇటు పంటకు రక్షణ లేదు! ■ నిర్మల్ జిల్లాలో కుదేలవుతున్న అన్నదాత
- ■ క్వింటాలుకు రూ. 700 నష్టం ■ దొంగతనాలతో కలవరం
- ■ నిర్మల్ జిల్లాలో1.11 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న సాగు
- ■ కోతలు ప్రారంభమైనా తెరవని కొనుగోలు కేంద్రాలు.
- ■ మద్దతు ధర రూ. 2400 ఉంటే.. బహిరంగ మార్కెట్‌లో రూ.1600కే కొనుగోలు చేస్తున్న వ్యాపారులు
- ■ రోడ్లపై ఆరబోసిన ధాన్యమే లక్ష్యంగా దోపిడీ
- ■ వారం రోజుల్లోనే రూ. 4 లక్షల పంట లూటీ
- ■ పోలీస్ నిఘా కరువుపై రైతుల ఆగ్రహం



ఆష్టా గ్రామంలో కల్లాల వద్దే రైతులతో 'మక్క' దళారుల బేరాసారాలు

నిర్మల్ జిల్లాలో రబీ సాగు చేసిన మొక్కజొన్న రైతుకు కష్టాలు రెట్టింపయ్యాయి. ప్రభుత్వం సూచించిన విధంగా పంట సాగు చేసినా, తీరా చేతికొచ్చే సమయానికి అటు ప్రభుత్వం నుండి గిట్టుబాటు ధర దక్కక, ఇటు దొంగల ముఠాల నుండి పంటకు రక్షణ లేక అన్నదాత కన్నీరు మున్నీరవుతున్నాడు. జిల్లా వ్యాప్తంగా సాగు ఆశాజనకంగా ఉన్నప్పటికీ, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు క్వింటాలుకు ఏకంగా 700 రూపాయల వరకు నష్టపోవాల్సి వస్తోంది. మరోవైపు, పంట కళ్లాల్లో ఉన్న ధాన్యమే లక్ష్యంగా దొంగల ముఠాలు పథకం ప్రకారం చేస్తున్న దోపిడీలు జిల్లావ్యాప్తంగా పెను కలకలం సృష్టిస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను ఇంటికి చేర్చుకోకముందే లూటీకి గురికావడం రైతులను దెబ్బ తీస్తోంది. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు మొరపెట్టుకుంటున్నారు.



# మక్క రైతుకు 'అశనిపాతం'

## మత్తు ముసుగులో
# ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు

- ■ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ■ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మితే చర్యలు
- ■ మంచిర్యాలలో డీ-అడిక్షన్ సెంటర్ ప్రారంభం
- ■ నార్కోటిక్, నిషేధిత డ్రగ్స్‌పై డేగ కన్ను
- ■ అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు

03



వివిధ వ్యాధుల నియంత్రణకు వైద్యులు సూచించిన విధంగా మాత్రమే మందుల దుకాణాల నిర్వాహకులు మందులు విక్రయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని డ్రగ్స్ ఇన్స్పెక్టర్ చందన, ఈగల్ ఫోర్స్ సి.ఐ. రవికుమార్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్, సుధాకర్ లతో కలిసి జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు.

## అక్షరమే ఆయుధం..
# పూలే ఆశయాలే మార్గం

- ■ స్ఫూర్తిప్రదాత పూలేకు ఘన నివాళి
- ■ అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి
- ■ పూలే సేవలను కొనియాడిన నేతలు..





# అక్షర రూపంలో జిల్లా చరిత్ర

## నిర్మల్‌లో 'వారసత్వ సంబురాలు' అమోఘం

నిర్మల్ పట్టణంలోని సిటీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం 'వారసత్వ సంబురాలు' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఎఎస్ అధికారి, పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, వైద్య వృత్తి, సంస్కృతి, సాంప్రదాయాలపై జిల్లా రచయితలు రచించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

## ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణకు
# సర్వం సిద్ధం చేయండి

- ■ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా
- ■ 20న నిర్వహించే సంస్మరణ దినోత్సవంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి
- ■ అమరవీరుల స్తూపం వద్ద పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్
- ■ భక్తులు, ఆదివాసీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు
- ■ చారిత్రక ప్రాధాన్యత కలిగిన వేడుకను ఘనంగా నిర్వహిస్తామన్న ఎమ్మెల్యే..

చారిత్రక ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఈ నెల 20న అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహిం చేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక స్తూపాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను వారు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఏప్రిల్ 20న ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి వేలాదిగా తరలివచ్చే ఆదివాసీలు, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదే శించారు.



10

# డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం







- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మితే చర్యలు
- ఔషధ నియంత్రణపై భారీ ర్యాలీ
- జలుబు, దగ్గుకు యాంటీబయాటిక్స్ వాడొద్దు
- మందుల దుకాణాల్లో క్యూఆర్ కోడ్ విధానం..
- దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన

**ఆదిలాబాద్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాలలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో ఔషధ నియంత్రణ, హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ వినియోగంపై స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుండి రిమ్స్ ఆడిటోరియం వరకు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించి పాల్గొన్నారు. అనంతరం రిమ్స్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో డ్రగ్స్ నియంత్రణ అత్యంత ముఖ్యమైన అంశమని, ముఖ్యంగా 'అల్ప్రాజోలం' వంటి ప్రమాదకరమైన హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ విషయంలో కెమిస్ట్‌లు, ఫార్మసిస్ట్‌లు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా ఇటువంటి మందులను విక్రయించడం చట్టరీత్యా నేరమని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్నపాటి జలుబు, దగ్గుకు నేరుగా యాంటీబయాటిక్స్ వాడకూడదని, షెడ్యూల్ హెచ్, హెచ్1 మందులను డాక్టర్ల సలహా మేరకే తీసుకోవాలని సూచించారు. లేనిపక్షంలో భవిష్యత్తులో ఏ మందులు పని చేయని పరిస్థితి వస్తుందని వివరించారు. రిమ్స్, మెడికల్ కళాశాల ప్రాంగణాల్లో సింథటిక్ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగంపై నిఘా ఉంచాలని హెచ్ఓడీలను ఆదేశించారు. మత్తుకు బానిసైన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చేందుకు డీ-అడిక్షన్ సెంటర్లను ఉపయోగించుకోవాలని సూచించారు. అత్యధిక మోతాదులో మందులు వాడటం వల్ల కిడ్నీలు, లివర్ వంటి అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, దీనిపై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని కోరారు. మందుల దుకాణాల్లో క్యూఆర్ కోడ్ విధానం ద్వారా మం దుల దుష్ప్రభావాలను తెలుసుకునేలా వినియోగదారులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఔషధ నియంత్రణపై వైద్యులు, ఔషద షాపుల యజమానులతో ప్రతిజ్ఞచేయించి, సంబంధిత పోస్టర్ లను కలెక్టర్ ఆవిష్క రించా రు. కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథో డ్, డీఎం హెచ్ఓ నరేందర్ రాథోడ్, డ్రగ్ ఇన్స్పెక్టర్ శ్రీలత, ఎస్ఐ సందీప్, మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యులు పాల్గొన్నారు.

# 11వ రోజుకు చేరిన ఆదివాసీల దీక్షా యజ్ఞం



- ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలి..
- నిరాహార దీక్షా శిబిరానికి తరలివచ్చిన ఉమ్మడి జిల్లా ఆదివాసీ సంఘాల నేతలు

**ఇంద్రవెల్లి, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం):**
ఆదివాసీల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా ఇంద్రవెల్లి అమర వీరుల స్తూపం వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారంతో 11వ రోజుకు చేరుకున్నాయి. ఆదివాసీ ప్రధాన్ సమాజ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ దీక్షా శిబిరంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుండి ఆదివాసీ నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ ప్రధాన్ సమాజ్ రాష్ట్ర నాయకులు నైతం రాంచందర్ (ఆసిఫాబాద్), కనక ప్రభాకర్, పెందోర్ ధర్ము అదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉయక సుదర్శన్ ప్రసంగిస్తూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఎస్టీ జాబితా ప్రక్షాళన చేయాలని, రాజ్యాంగ విరుద్ధంగా ఎస్టీ జాబితాలో చేరిన లంబాడీలను తక్షణమే ఆ జాబితా నుండి తొలగించాలన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల రక్షణ కవచాలైన 'పేసా' చట్టం మరియు 1/70 చట్టాలను పక్కాగా అమలు చేయాలని, అక్రమ కట్టడాల తొలగింపు: ఏజెన్సీ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న కట్టడాలను వెంటనే కూల్చివేసి, భూములను ఆదివాసీలకు అప్పగించాలన్నారు. అమరవీరుల కుటుంబాలకు బాసట ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి, వారిని ఆర్థికంగా ఆదుకోవాలన్నారు. ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు కనక సంతోష్, ప్రధాన కార్యదర్శి సోయం రాందాస్ మాట్లాడుతూ.. ఆదివాసీల ఆత్మగౌరవం కోసం, ఏజెన్సీ పరిరక్షణ కోసం సాగుతున్న ఈ పోరాటం లక్ష్యం నెరవేరే వరకు ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రధాన్ సంఘం నాయకులు గేడం భరత్, తోడశం సాగర్, రగల్ జెండా చైర్మన్ మేస్రం నగ్నత్, తుడుం దెబ్బ మండల అధ్యక్షుడు పూర్కా చిత్రు, మాధవరావు, గణేష్, మురహరి, అర్కా ఖమ్ము, మేస్రం రవి, ముకింద్, చిక్రం రాము, భవేష్ మరియు అధిక సంఖ్యలో ఆదివాసీ యువత, మహిళలు పాల్గొన్నారు.




## జన్నారం నూతన ఎస్సైగా
# ఉదయ్ కిరణ్ బాధ్యతల స్వీకరణ

### శాంతిభద్రతల పరిరక్షణే నా మొదటి ప్రాధాన్యం
### బాధ్యతలు చేపట్టిన వెంటనే విధుల్లో నిమగ్నం

**జన్నారం, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం):**
జన్నారం మండల నూతన సబ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉదయ్ కిరణ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన అధికారి బదిలీ కావడంతో, వారి స్థానంలో నియమితులైన ఉదయ్ కిరణ్ బాధ్యతలు చేపట్టేందుకు పోలీస్ స్టేషన్‌కు చేరుకోగా, సిబ్బంది మరియు తోటి అధికారులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి సాదర స్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై ఉదయ్ కిరణ్ విలేకరులతో మాట్లాడారు. మండలంలో శాంతిభద్రతలను కాపాడటమే తన ప్రధాన లక్ష్యమని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ వ్యవస్థ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, మండల అభివృద్ధికి మరియు శాంతికి ప్రజాప్రతినిధులు, అధికారులు, మరియు స్థానిక ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన కోరారు.

# పూలే జయంతి వేడుకలు

**జన్నారం, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలో జ్యోతి రావు పూలె 199 వ జయంతి సందర్భంగా పూల మాలవేసి ఘనంగా నిర్వహించడం జరిగినది కార్యక్రమంలో అఖిలభారత విశ్వకర్మ సంఘమ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాముల గంగాధర్ గౌరవ అధ్యక్షులు యశోద గురువయ్య ఉపాధ్యక్షులు శ్రీరాముల వెంకటేష్ రాగుల రామచంద్రం కట్ట వెంకటేష్ బీసీ నాయకుడు కోడూరి చంద్రయ్య సంగం నాయకులు రమేష్ అంజి విజయ్ హరీష్ శ్రీను కిరణ్ సాయి రవి రాగుల చారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# మైనార్టీ గురుకుల అడ్మిషన్ మేళా

**జైనూర్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
జైనూర్ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలలో అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా మండల కేంద్రంలోని జామా మస్జీద్ వద్ద శనివారం ప్రత్యేక అడ్మిషన్ మేళాను నిర్వహించారు. కార్యక్రమానికి విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై విశేష ఆసక్తి చూపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూఫియా నాజ్ మాట్లాడుతూ గురుకులంలో ఉచిత విద్యతో పాటు వసతి, పోషకాహారం, యూనిఫార్మ్‌లు, పాఠ్యపుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు. అదనంగా డిజిటల్ క్లాసులు, సైన్స్ ల్యాబ్‌లు, క్రీడా సదుపాయాలుపోటీ పరీక్షల కు ప్రత్యేక కోచింగ్ కూడా అందిస్తున్నట్లు చెప్పారు. అడ్మిషన్ అర్హతలు, దరఖాస్తు విధానం గురించి తల్లిదం డ్రులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు గురు కులంలో అందిస్తున్న సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు.



# కారుణ్య నియామకాలతో ఆ కుటుంబాల్లో వెలుగు

- 16 మంది అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేసిన కలెక్టర్ రాజర్షి షా
- రెవెన్యూ, వైద్య, ఇరిగేషన్ సహా వివిధ శాఖల్లో పోస్టింగ్స్
- మొత్తం 15 జూనియర్ అసిస్టెంట్, ఒక ఆఫీస సబార్డినేట్ పోస్టుల భర్తీ
- అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ పిలుపు
- దశాబ్దాల నిరీక్షణకు తెర..





**ఆదిలాబాద్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో కారుణ్య నియామకాల కింద వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు ఎంపికైన 16 మంది అభ్యర్థులకు ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ రాజర్షిషా శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉండి మరణించిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నియామకాలు చేపట్టిందని తెలిపారు. విధుల్లో చేరిన వారు అంకితభావంతో పనిచేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆయన ఆకాంక్షించారు. అభ్యర్థులను 10 రెవెన్యూ, 2 సేల్స్ టాక్స్, 1 వెల్ఫేర్, 1 వైద్య శాఖ, 1 అకౌంట్స్, 1 ఇరిగేషన్ శాఖలకు కేటాయించగా, మొత్తం 15 జూనియర్ అసిస్టెంట్, ఒక ఆఫీస్ సబార్డినేట్ పోస్టులకు నియామక పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో వర్ణ, సీనియర్ అసిస్టెంట్ ప్రసాద్, అధికారులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# మత్తు ముసుగులో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు





- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మితే చర్యలు
- మంచిర్యాలలో డీ-అడిక్షన్ సెంటర్ ప్రారంభం
- నార్కోటిక్, నిషేధిత డ్రగ్స్‌పై డేగ కన్ను
- అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు

**మంచిర్యాల, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**

వివిధ వ్యాధుల నియంత్రణకు వైద్యులు సూచించిన విధంగా మాత్రమే మందుల దుకాణాల నిర్వాహకులు మందులు విక్రయించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని డ్రగ్స్ ఇన్స్పెక్టర్ చందన, ఈగల్ ఫోర్స్ సి.ఐ. రవికుమార్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులు చంద్రశేఖర్, సుధాకర్ లతో కలిసి జెండా ఊపి ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మందుల దుకాణాల నిర్వాహకులు, వైద్యులు సూచించిన ప్రిస్క్రిప్షన్ ప్రకారం మాత్రమే ప్రజలకు మందులను విక్రయించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని, నిష్ణాతులైన వైద్యులు ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్నారని తెలిపారు. ప్రజలు సొంత ఆలోచన ప్రకారం మందులు, సిరప్ లు వినియోగించకూడదని, వైద్యులను సంప్రదించి వారి



సూచన మేరకు మందులు వినియోగించాలని తెలిపారు. నార్కోటిక్, నిషేధిత డ్రగ్స్ విక్రయం, వినియోగంపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, మందుల విక్రయంలో మందుల దుకాణాల నిర్వాహకులు సమిష్టిగా ఉండాలని, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా ఎలాంటి మందులను విక్రయించకూడదని తెలిపారు. మందుల షాపుల నిర్వాహకులు సరైన అర్హత, అనుమతి తప్పనిసరిగా కలిగి ఉండాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 7 పడకలతో ఏర్పాటు చేసిన డ్రగ్స్ డి-అడిక్షన్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు వేదవ్యాస్, ఆర్.ఎం.ఓ. భీష్మ, వైద్యాధికారులతో కలిసి ప్రారంభించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారిని సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ఈ సెంటర్ ద్వారా వైద్య సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఇంటర్, డిగ్రీ, ఐ.టి.ఐ., ఇంజనీరింగ్, మెడికల్ కళాశాలల విద్యార్థులకు మత్తు పదార్థాలు, మద్యం వలన కలిగే నష్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని, అధ్యాపకులు, తల్లితండ్రులు పిల్లల ప్రవర్తనలో కలిగే మార్పులపై పర్యవేక్షించాలని, ప్రవర్తన మారిన పిల్లలను డిఅడిక్షన్ సెంటర్‌కు తీసుకురావాలని తెలిపారు. ఈ సెంటర్ నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు కేటాయించడం జరుగుతుందని, స్వచ్ఛంద సంస్థలు డ్రగ్స్ నియంత్రణపై అధికారుల సమన్వయంతో పని చేయాలని తెలిపారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయం అంశాలపై హెల్ప్ లైన్ నంబర్లు 14416, 1908 లలో సమాచారం అందించవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య విద్యార్థులతో తాము జీవితంలో ఎలాంటి మత్తు పదార్థాలు తీసుకోబోమని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డా. సునీల్ కుమార్, డా. కిరణ్ కుమార్, నర్సింగ్ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మేనిఫెస్టోను అమలు చేయాలి



**తాండూర్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**

సింగరేణి ఎన్నికల సమయంలో ఏఐటీయూసీ, ఏఎన్‌టీయూసీ, కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు మేనిఫెస్టో ద్వారా ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా వైస్ ప్రెసిడెంట్ మల్రాజు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం బెల్లంపల్లి ఏరియా తాండూర్ మండలం గోలేటి ఏరియా వర్క్ షాప్‌లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఫిట్ కార్యదర్శి గాజవేని శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన గేటు మీటింగ్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐటీయూసి గెలిచిన తర్వాత కార్మికులు కోల్పోయిన హక్కులను వివరించారు. టీబీజీకేఎస్, కేసీఆర్ నాయకత్వంలో సింగరేణి కార్మికులు ఎన్నో హక్కులను సాధించుకున్నారని తెలిపారు. ఫలితంగానే సింగరేణి కార్మికులు బీఆర్ఎస్ హయములో సంతోషంగా ఉండేవారని అన్నారు. రెండు సంవత్సరాలుగా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ గాని రాష్ట్ర ప్రభుత్వం గానీ సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా లాభాల వాటాను తగ్గించడంతోపాటు కేసీఆర్ అమలు అమలు చేసి ఉద్యోగ కారుణ్య నియమకాలను నిలిపివేశారని ఆందోళన వ్యక్తంచేశారు. మెడికల్ బోర్డులను నిర్వహించడం లేదని ఆరోపించారు. రానున్న సింగరేణి ఎన్నికలలో టీబీజీ కేఎస్ సొంతంగానే పోటీ చేస్తుందని ఎవరితో పొత్తు ఉండదని ఆయన పేర్కొన్నారు. మంగీలాల్, మారిన వెంకటేశ్వర్లు, సెంట్రల్ జాయింట్ సెక్రటరీ ఓరం కిరణ్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ సురేష్, స్టోర్ పిట్ సెక్రటరీ గణపతి, నాయకులు రమేష్, వైకుంఠం, తదితరులు పాల్గొన్నారు.



## మున్నూరు కాపు సంఘం

# బలోపేతానికి కృషి చేస్తా

**రెబ్బెన, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**

రెబ్బెన మండల మున్నూరు కాపు సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మున్నూరు కాపు మండల సంఘాన్ని, మండల యూత్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు. మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా జగడం సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మాదాసు రవీందర్, ఉపాధ్యక్షులుగా దేవర నేని రవీందర్, జంబుల సాయి కృష్ణ, ప్రచార కార్యదర్శిగా మిట్ట దేవేందర్, కార్యదర్శిగా కర్నాథం వెంకటేశం, ఇంగు మల్లేష్ , కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యూత్ కమిటీ అధ్యక్షుడిగా ఇంగు సాయి, ప్రధాన కార్యదర్శిగా ఎరువోతుల నాగేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు జగడం సత్యనారాయణ మాట్లాడుతూ మండలంలో మున్నూరు కాపు సంఘం బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని వెల్లడించారు. అన్ని గ్రామాల్లో గ్రామ కమిటీలు ఎన్నుకుంటామని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నుకైన అధ్యక్షులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కులపెద్దలు కర్నాథం సంజీవ్ కుమార్ ,చెన్న సోమశేఖర్, గజ్జెల సత్యనారాయణ, కొవ్వూరు శ్రీనివాస్, గోలెం తిరుపతి, మానేం కార్తీక్, హనుముల రాజేష్, ఒరగంటి మల్లేష్, పుదరి హరీష్, కుందారపు బాలకృష్ణ, ఇందూరి తిరుపతి, మిట్ట వెంకటేష్, పుదరి బీంరావు, పిరిసింగుల సుబ్బారావు, ఏలుగల సాయి, పిరిసింగుల రాజన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా జ్యోతిబాపూలే చేసిన కృషి చిరస్మరణీయం



- సామాజిక స్ఫూర్తిప్రదాత పూలేకు ఘన నివాళి
- అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి
- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

**మంచిర్యాల, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**

సామాజిక న్యాయం, విద్యా విస్తరణ, సమానత్వం కోసం మహాత్మ జ్యోతిబాపూలే చేసిన కృషి చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మహాత్మ జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకొని శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, వివిధ శాఖల అధికారులు, బి. సి. సంఘాల ప్రతినిధులతో కలిసి మహాత్మ జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సామాజిక న్యాయం, విద్యా విస్తరణ, సమానత్వం కోసం మహాత్మ జ్యోతిబాపూలే విశేష కృషి చేశారని తెలిపారు. పేదలు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అందించిన సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో సమానత్వం కోసం, అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, వివిధ బి.సి. సంఘాల ప్రతినిధులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి జ్యోతిబా పూలే

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబాపూలే అని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన జ్యోతిబా పూలే జయంతి వేడుకల్లో పాల్గొని పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భం గా అయన మాట్లాడుతూ బలహీన వర్గాల కోసం మహిళల విద్యాభ్యాసం కోసం జ్యోతిబా పూలే విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. సంఘ సంస్కర్త, తత్వవేత్త, విద్యావేత్తగా అనేక కార్యక్రమాలను చేపట్టార ని అయన చూపిన బాటను అనుసరించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మహనీయుల ఆశయ సిద్ధాంతాలను అచరించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అనిల్, మున్సిపల్ ఛైర్మన్ ఆకాష్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ మంగ, డీసీసీ అధ్యక్షురాలు సుగుణ, ఆసిఫాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, కౌన్సిలర్లు అబ్దుల్లా, స్వప్నరాణి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఆలీబిన్ ఆహ్మద్, అయా సంఘాల నాయకులు శంకర్, కేశవరావు, డాక్టర్ రమేష్, రవిందర్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు. వాంకిడి మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన జయంతి వేడుకల్లో జ్యోతిబాపూలే విగ్రహాలకు, చిత్రపటాలకు మాలీ సంక్షేమ సంఘం, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్‌కార్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు జైరాం ఉప్రె, దుర్గం దుర్గాజీ, పాల్గొన్నారు. బెజ్జూరు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో మాలి సంఘం నాయకులు కొట్రంగి రామకృష్ణ, బీమన్న, నందయ్య, గోపాల్, సెండె శంకర్, మాండూరి శంకర్, సురేష్,



మోహన్, తిరుపతి, రాజు నాయకులు తిరుపతి, జావీద్‌అలీ, సతీష్ తదితరులు ఉన్నారు. జైనూర్ మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో జైనూర్ సర్పంచ్ కొడప ప్రకాష్, దళిత రత్న అవార్డు గ్రహిత మోహలె దత్త, మాలి సంఘం అధ్యక్షుడు హుస్సెన్ పెట్కులె, జంగ్టె రాందాస్, జంగ్టె రాజకుమార్, లెండగూరె సంజీవ్ తదితరులు ఉన్నారు.



## అక్రమ కేసులను ఎత్తివేయాలి

**నిర్మల్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
సిపిఐ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రంగారావు పై ఏన్ఐఏ పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని ఆ పార్టీ నాయకులు నిర్మల్ లో నిరసన తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట అరెస్టుకు నిరసనగా నినాదాలు చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ప్రభుత్వం ఆయన అరెస్టు చేయడం కక్ష సాధింపు చర్యని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజన్న బక్కన్న రామ్ లక్ష్మణ్ గంగన్న మహేందర్ లక్ష్మి గోదావరి తదితరులున్నారు

## ఎంజెపిలో పూలే జయంతి వేడుకలు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
మండలంలోని బాబాపూర్ గ్రామ సమీపంలో గల ఎంజెపి బాలికల గురుకుల పాఠశాలలో మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. జ్యోతిరావు పూలే దంపతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ప్రిన్సిపాల్ సుకన్య పూలే దంపతుల సేవలను విద్యార్థులకు వివరించారు. విద్య ఆవశ్యకతను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, విద్యార్థులు పాల్గొన్నారు.



## కొనసాగుతున్న విద్యుత్ కార్మికుల సమ్మె

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిసన్, ఆన్మాన్, పీస్ రేట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాలుగో రోజుకు చేరుకుంది. ఆసిఫాబాద్ సర్కిల్ కార్యాలయం ముందు టీవీఏఈ జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా చైర్మన్ ఆత్రం మారుతీ, కన్వీనర్ షేక్ నసీరుద్దీన్ మాట్లాడుతూ... ఒకే సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు ఒకే సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిసన్ కార్మికులకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ అమలు చేయడం, ఆన్మాన్ కార్మికులను ఆర్టిసన్‌గా గుర్తించడం, పీస్ రేట్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం, 2026 పీఆర్సీ



వేతన సవరణ ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 150 మంది విద్యుత్ కార్మికులు పాల్గొన్నారు.

## లంబాడి తండాలో కార్డెన్ సెర్చ్



**కాసిపేట, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం లంబాడి తండా గ్రామంలో పోలీసులు శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. లంబడి తండా గ్రామాన్నిపోలీసులు ఆకస్మికంగా చుట్టు ముట్టారు. దేవాపూర్, కాసిపేట, రామకృష్ణాపూర్. ఎస్ఐలు, పోలీస్ బలగాలు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించదమంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. నివాస గృహాల్లో ప్రవేశించి సోదాలు చేశారు. అనుమానస్పద వ్యక్తుల సమాచారం, అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఈ ప్రాంతంలో ఉంటున్నారా? అపరచిత వ్యక్తులకు ఇక్కడ ఎవరైనా షెల్టర్ ఇస్తున్నారా అనే కోణంలో విచారిస్తూ ప్రతి ఒక్కరి ఆధార్ కార్డ్, గుర్తింపు కార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో నివసించే వారి ద్విచక్ర వాహనాలు ఆర్ సి, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్‌లు చెక్ చేశారు. అదేవిధంగా సరైన ధ్రువ పత్రాలు లేని, నెంబర్ ప్లేట్ లేని 43 ద్విచక్ర వాహనాలను గుర్తించి వాటికి అక్కడికక్కడే ఫైన్ వేసశారు. నెంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాలను సీజ్ చేశారు. పోలీసులు 180 లీటర్ల గుడుంబా పానకం ధ్వంసం చేశారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ ను ఉద్దేశించి దేవాపూర్ ఎస్సై గంగారాం స్థానిక ప్రజలకు సైబర్ క్రైమ్, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్త చట్టాలపై అవగాహన, మూఢ నమ్మకాల గురించి అవగాహన కల్పించారు. వాహనదారులు హెల్మెట్ తప్పకుండా పెట్టుకోవాలని, ట్రాఫిక్ నిబంధన లను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట, రామకృష్ణాపూర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఔషధ నియంత్రణ అవగాహన

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలో ఔషధ నియంత్రణ, నియంత్రణ వ్యవస్థ బలోపేత దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అశ్విని ఆధ్వర్యంలో ఫార్మాసిస్టులు, మెడికల్ షాప్ యజమానులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డ్రగ్స్, గంజాయి వంటి నిషేదిత పదార్థాలపై నియంత్రణ అవసరాన్ని వివరించి, ఔషధాల సరైన వినియోగం, షెడ్యూల్డ్ మందుల నిబంధనలపై అవగాహన కల్పించారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించరాదని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సూచించారు. కార్యక్రమం అనంతరం డ్రగ్స్ కంట్రోల్ క్విజ్, వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సీతారాం, డీడబ్ల్యూఓ భాస్కర్, ఈగిల్ టీం సభ్యుడు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బూత్ స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం

### జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చిన్నం సత్యం

**ఖానాపూర్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లాలో ప్రతి మండలం బూతు స్థాయి నుండి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, ఖానాపూర్ మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ చిన్నం సత్యనారాయణ అన్నారు. ఆయనను నిర్మల్ జిల్లా మామడ మండలం బూతు అధ్యక్షునిగా నియమించిన అనంతరం మామడ గ్రామంలో ఒక కార్యక్రమంలో కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో ఒక యువ నాయకున్ని తయారు చేయాలని, కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారికి అర్థమయ్యే విధంగా తెలియజేయాలని పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ రానున్న ఎన్నికల్లో విజయం సాధించే లాగా కృషి చేయాలని ఆయన అన్నారు.



# బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే

**నిర్మల్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
భారతదేశ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిబాపూలే అని నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు అన్నారు. శనివారం పూలే 199వ జయంతి వేడుకలను నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు మాట్లాడుతూ... బడుగు బలి బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పూలే ఎంతో పోరాట చేశారని, దీనికి నిదర్శనం బ్రిటిష్ వారే మహాత్మా అనే



బిరుదును పూలేకు ఇవ్వడం జరిగింది. చదువు ద్వారానే అందరీ భవిష్యత్తు బాగా పడుతుందని ఎలుగెత్తి చెప్పిన గొప్ప వ్యక్తి పూలే అని ఆయన అన్నారు. పూలే రచించిన గులాం గిరి పుస్తకం ఎంతో ప్రాచుర్యం చెందిందని ఆయన అన్నారు. వచ్చే సంవత్సరం పూలే జయంతి వేడుకలను పూలే దంపతుల విగ్రహాల వద్ద జరుగుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు మరకంటి జీవన్, అసోసియేట్ అధ్యక్షుడు కొత్తపల్లి గంగాధర్, కో.కన్వీనర్లు కత్రోజు అశోక్, చారి, సిరికొండ రమేష్,చందుల ఊషన్న, పండరీనాథ్, సంపంగి ప్రభాకర్,శివకుమార్ వర్మ, అధ్యక్షులు ఏంబడి.చంద్రశేఖర్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు స్వదేశ పరికిపండ్ల,రామకృష్ణ, రమేష్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.






## అక్షరమే ఆయుధం
# పూలే ఆశయాలే మార్గం

**జిల్లాలో మిన్నంటిన జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు**
**జడ్పీ సమావేశ మందిరంలో ఘనంగా నివాళులర్పించిన కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే.**
**విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యం - ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**
**జైనథ్‌లో రూ.20 కోట్లతో నిర్మించిన పూలే పాఠశాల ప్రారంభం**
**త్వరలోనే బీసీ ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం - ఎమ్మెల్యే పాయల్ శంకర్ హామీ**
**విజేతలకు బహుమతుల ప్రదానం - పూలే జీవిత చరిత్రపై ఆడియో సీడీ ఆవిష్కరణ**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యం అని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారం. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మహాత్మా జ్యోతిబా పూలే 200వ జయంతి కార్యక్రమానికి ఆదిలాబాదు పార్లమెంటు సభ్యులు గోడం నగేష్, స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషలతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు ఆహ్వానితులను అలరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలోని అసమానతలను గుర్తించి, వాటి నిర్మూలనకు కృషి చేసిన గొప్ప సంస్కర్త జ్యోతిబా పూలే అని కొనియాడారు. విద్య ద్వారానే అంటరానితనం, స్త్రీ పురుష అసమానతలు తొలగిపోతాయని నమ్మిన ఆయన, తన భార్య సావిత్రిబాయి పూలేను విద్యావంతురాలిని చేసి దేశంలోనే మొదటి మహిళా ఉపాధ్యాయురాలిని చేశారని గుర్తు చేశారు. వారి కృషి ఫలితంగానే నేడు భారత రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు విద్య మరియు రిజర్వేషన్ల రూపంలో అనేక ఫలాలు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు సెల్ ఫోన్లు, మత్తు పదార్థాల వంటి అనవసరమైన ఆకర్షణలకు లోనుకాకుండా తమ లక్ష్యాల సాధనపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరుతూ, జైనద్ లో సుమారు 20 కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించిన జ్యోతిబా పూలే పాఠశాల భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారని, విద్యార్థులకు డైట్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలను సైతం పెంచడం జరిగిందని వివరించారు. మహనీయుల జీవిత చరిత్రలను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.



ఆదిలాబాదు పార్లమెంటు సభ్యులు మాట్లాడుతూ, సుమారు రెండు వందల ఏళ్ల క్రితం, దేశానికి స్వాతంత్ర్యం రాకముందే సామాజిక అస్పృశ్యతను ఎదురించి, పేద వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషిని కొనియాడారు. విద్య అనేది కేవలం కొందరికే పరిమితమైన ఆ రోజుల్లో, ప్రతి ఒక్కరికీ విజ్ఞానం అందాలని, సమాజ వికాసం జరగాలని నమ్మిన గొప్ప ఆదర్శమూర్తి పూలే అని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నాయని, ఈ అవకాశాలను అందరూ అందిపుచ్చుకోవాలన్నారు. విద్య పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని, పేద వర్గాలకు విద్యను అందించడంలో మన వంతు కృషి ఉండాలని గుర్తు చేశారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహనీయుల జీవిత చరిత్రను చదవడం లేదా త్యాగాలను స్మరించుకోవడం మాత్రమే సరిపోదని, వారి ఆలోచనా విధానాన్ని ఎప్పుడైతే మనం ఆచరణలో పెడతామో అప్పుడే సార్థకత లభిస్తుందని అభిప్రాయపడ్డారు. గతంలో సమాజంలో ఉన్న మూఢనమ్మకాలు, ముఖ్యంగా మహిళల పట్ల ఉన్న వివక్షను ప్రస్తావిస్తూ, ఒకప్పుడు వితంతువుల పరిస్థితి అత్యంత దారుణంగా ఉండేదని, శుభకార్యాలకు కూడా వారిని రానివ్వని దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వాలు మహిళల అభ్యున్నతికి అనేక అవకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. బీసీ సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు జిల్లాలో త్వరలోనే 'బీసీ ఇంటిగ్రేటెడ్ కమ్యూనిటీ హాల్స్' నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. భవన నిర్మాణాలు లేని సంఘాలకు ఐదు లక్షల రూపాయల చొప్పున మంజూరు చేస్తూ, స్థల కేటాయింపు ప్రక్రియ వేగవంతం చేసేలా చూస్తానని తెలిపారు. ఈ సందర్భంగా సుకుమార్ పెటుకులే పూలే జీవిత చరిత్రపై రచించి రూపొందించిన ఆడియోసిడిని కలెక్టర్, ఎంపి, ఎమ్మెల్యే ఆవిష్కరించి, వివిధ పాఠశాలల విద్యార్థులకు పూలే జీవిత చరిత్ర పై నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విజేతలకు మెమెంటో, ప్రశంస పత్రాలను కలెక్టర్, ఎమ్మెల్యే అందజేశారు. అంతకుముందు స్థానిక బిసి సంక్షేమ శాఖ కార్యాలయ ఆవరణలో, భుక్తాపూర్ లోని పూలే కూడలిలో, దస్నాపూర్ లోని బిసి స్టడీ సర్కిల్ ఆవరణలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా చిత్రపటాలకు, విగ్రహాలకు కలెక్టర్, మున్సిపల్ చైర్ పర్సన్, అధికారులు, కుల సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమాలలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, బిసి సంక్షేమ అధికారి సోనియా, ఎస్సీ సంక్షేమ అధికారి సునీత కుమారి, ఈడి మనోహర్, కౌన్సిలర్లు శ్రీనివాస్, స్వాతి పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి స్పష్టమైన ప్రణాళిక

**మంచిర్యాల మేయర్ ధర్ని మధుకర్**



**మంచిర్యాల, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కా రానికి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని మేయర్ దర్ని మధుకర్ అన్నారు. కార్పొరేషన్‌లోని 2వ డివిజన్‌లోని సీసీసీ, ఆర్‌కే-5 కాలనీల్లో శనివారం శుభ్రత -ప్రతి ఒక్కరి బాధ్యత, ప్రగతి ప్రణాళికలో భాగంగా డివిజన్ లో కార్పొరేషన్ అధికారులతో కలిసి మేయర్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలను అ డిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో కావాల్సిన అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మేయర్ తెలిపారు. ఇళ్లలోని చెత్తను ఇష్టం వచ్చినట్లు బయట పడేయవద్దని సూచించారు. మున్సిపల్ సిబ్బంది చెత్త బండి తో వచ్చినప్పుడు బండిలో వేయాలన్నారు. సిబ్బంది కూడా మురుగు కాలువలు, చెత్త చెదారంను శుభ్రం చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతకు అం దరూ కట్టుబడి ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే నివసించే ప్రజలు ఆ రోగ్యం గా వ్యాధులకు దూరంగా ఉంటారన్నా రు. అన్ని డివిజన్ల అభివృద్ధి కోసం శాయ శక్తుల కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటి మేయర్ రమ్య, 2వ డివిజన్ కార్పొరేటర్ పుట్ట యశోధ, నాయకులు శ్రీనివాస్, అజయ్, కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## కొనసాగుతున్న
# ఆర్టిజన్ కార్మికుల సమ్మె

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్‌శాఖ సర్కిల్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపడుతున్న సమ్మె దీక్షలు శనివారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా జేఏసీ ఛైర్మన్ అత్రం మారుతి, కన్వీనర్ షేక్ నసీరుద్దీన్ మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్ కార్మికులకు స్టాండింగ్ ఆర్డర్‌ను రద్దు చేసి ఒకే సంస్థ, ఒకే సర్వీసు రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మహబుబ్‌పాషా, శ్రీకాంత్, అశోక్, శిరీష, వామన్, శ్రీకాంత్, ఏకాంబరం పాల్గొన్నారు.

# అగ్నిప్రమాదంలో మొక్కజొన్న దగ్ధం

**కుభీర్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**
మండలంలోని చాత గ్రామానికి చెందిన రైతు సాయినాథ్ కు చెందిన మొక్కజొన్న పంట అగ్ని ప్రమాదంలో శనివారం కాలిపోయినట్టు రైతు తెలిపారు. పంట చేన్లో రెండు ఎకరాల మొక్కజొన్నలు కోసి ఆరబెడుతుండగా శనివారం ఒక్కసారిగా మంటలు రావడంతో దాన్ని ఆర్పేందుకు రైతులు ప్రయత్నించారు. అయితే పంట మొత్తం కాలిపోయటంతో లక్ష రూపాయల వరకు నష్టం జరిగినట్టు రైతు సాయినాథ్ తెలిపారు. పంటపొలాని వ్యవసాయ శాఖ అధికారులు సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.



# వ్యక్తులను టార్గెట్ చేసే ఉద్యమాలు వద్దు

## ఉద్యమకారులకు ఎమ్మెల్యే బొజ్జు పటేల్ హితవు



**ఉట్నూర్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసి ఉద్యమకారులు కొంత మంది వ్యక్తులను టార్గెట్ చేస్తూ ఉద్యమాలు చేస్తున్నారని, వ్యక్తులను టార్గెట్ చేసి ఉద్యమాలు చేయడం మంచి పద్ధతి కాదని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఉద్యమకారులకు హితవు పలికారు. శనివారం ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా సన్నాహక సమావేశాన్ని ఆదివాసి పెద్దలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదివాసులను ఉద్దేశించి మాట్లాడుతూ.. కొంతమంది ఉద్యమకారులు కొందరినీ టార్గెట్ చేసుకొని అమాయక ఆదివాసులను ముందుకు తీసుకువచ్చి ఉద్యమాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులు ఆదివాసుల సమస్యలపై ఉద్యమాలు చేయాలని ఈ సందర్భంగా సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మారుమూల గిరిజన గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తే అటవీ శాఖ అధికారులు ఇంటి నిర్మాణాలను అడ్డుకుంటున్నారని, ఆదివాసుల సమస్యలతో పాటు నిర్మాణాలపై అటవీ శాఖ పై ఎందుకు ఉద్యమాలు చేయడం లేదని ఆయన ఈ సందర్భంగా ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తన నియోజకవర్గంలో పాటు ఆదివాసుల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని, గత ఏడాది ఇంద్రవెల్లి ఉట్నూరు మండలాల్లో రహదారుల పరిస్థితిని గమనించి రూ .36 కోట్లు మంజూరు చేయించానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మారుమూల గిరిజన గ్రామమైన హీరాపూర్ వస్తానని నిర్ణయించడం వల్ల ఇంద్రవెల్లి మండలంలోని అన్ని మారుమూల గ్రామాల ప్రజల సమస్యలు తీరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ, రాజ్ గోండు సేవాసమితి రాష్ట్ర శాఖ అధ్యక్షులు సోయం బాపూరావు మాట్లాడుతూ.. తనతో పాటు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ను పిలిపించి హీరాపూర్ గ్రామంలో ఆదివాసి పటేళ్ల పెద్దలతో సమావేశం నిర్వహించి సమస్యలను గుర్తించాలని సీఎం రేవంత్ రెడ్డి తమకు చెప్పారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ని కలిసి తేదీన నిర్ణయిస్తామని సోయం బాపూరావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ ప్రాంతానికి వస్తే ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని ఆదివాసులకు వివరించారు. ఈ సమావేశంలో ఐటీడీఏ పాలకవర్గం మాజీ చైర్మన్ సిడం అర్జు, రాయి సెంటర్ల జిల్లా మేడి పేందూరు అమృత్ రావు, సార్ మేడిలు వెంకట్రావు, సర్పంచ్ తులసము లక్ష్మీబాయిలతో పాటు ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరికొండ, కొమురం భీం జిల్లా గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గిరిజన రైతుల ఇంట పట్టాల పండగ



**13 ఏళ్ల నిరీక్షణకు తెర..**
**కలెక్టర్ రాజర్షి షా చొరవతో భూ సమస్యకు పరిష్కారం.. రైతుల కళ్లలో ఆనందం**
**పల్సిబి తండా రైతులకు పట్టాలు అందజేసిన కలెక్టర్, ఎమ్మెల్యే పాయల్ శంకర్**
**ఫారెస్ట్, రెవెన్యూ శాఖల మధ్య చిక్కుముడిని విప్పిన జిల్లా యంత్రాంగం**
**9 మంది గిరిజన రైతులకు 30 ఎకరాల భూమిపై దక్కిన యాజమాన్య హక్కులు**



**ఆదిలాబాద్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)** ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పల్సిబి తండాకు చెందిన గిరిజన రైతుల 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. జిల్లా కలెక్టర్ రాజర్షి షా చొరవతో సమస్యను వేగంగా పరిష్కరించి, రైతులకు భూ పట్టాలు అందజేశారు. ఫారెస్ట్, రెవెన్యూ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, సర్వే నంబర్లలో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా పల్సిబి తండాకు చెందిన సుమారు 9 మంది ఎస్టీ రైతులు దశాబ్దకాలంగా పట్టాలు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడంలో కూడా వారు వెనుకబడ్డారు. రైతులు తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగానే, ఆయన వెంటనే స్పందించి సీసీఎల్ఏ అధికారులతో సమన్వయం చేసి పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ పర్యవేక్షణలో రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టి సమస్యను కొలిక్కి తెచ్చింది. ఈ పరిష్కారంలో భాగంగా మొత్తం 30 ఎకరాల భూమిని అర్హులైన రైతులకు కేటాయించారు. 9 మంది రైతులకు వారి సాగు విస్తీర్ణం ఆధారంగా 2 నుండి 3 ఎకరాల వరకు పట్టాలు కలెక్టర్ స్వయంగా అందజేశారు. పట్టాలు అందుకున్న రైతులు శనివారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆనందం వ్యక్తం చేస్తూ కలెక్టర్‌ను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. తమ దీర్ఘకాల సమస్యను పరిష్కరించినందుకు ప్రభుత్వానికి, జిల్లా యంత్రాంగానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంఆర్ఓ రాజ్‌మోహన్, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



## అవార్డు గ్రహీతకు సన్మానం

**జైనూర్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)** ఆసిఫాబాద్ జిల్లా మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షులు జైనూర్ వాసి మహాలే దత్త మాంగ్‌కు శనివారం జైనూర్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సన్ రైస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు షేక్ జమీల్, ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అవార్డు గ్రహీత మావాలే దత్త మాంగ్ చేసిన సేవలను గుర్తించి దళిత రత్న అవార్డు ఇవ్వడం ఎంతో గర్వకారణమని సన్రైజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ షేక్ జమీల్, జైనూర్ మాజీ వైస్ ఎంపీపీ రషీద్ నాయకులు అన్నారు. ఇలాగే సమాజ సేవలు చేస్తూ మరిన్ని అవార్డులు తీసుకొని ప్రజల్లో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జన్నావార్ పవన్ కుమార్, సుద్దాల శ్రీనివాస్, వార్డు మెంబర్లు షేక్ రహీం, భూతాలే కిరణ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## జ్యోతిబా పూలే జయంతి వేడుకలు

**నిర్మల్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)** శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సామాజిక విప్లవకారుడు మహాత్మ జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభంలో మహాత్మ జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రత్న కళ్యాణి మాట్లాడుతూ, అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే అని కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, డీఈవో భోజన్న, అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారి సత్యనారాయణ, సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అవగాహనతోనే మహమ్మారికి చెక్

- విజేతలకు బహుమతుల ప్రధానం
- రిమ్స్‌లో ఆరోగ్య వారోత్సవాల ముగింపు
- విజేతలను అభినందించిన కలెక్టర్ రాజర్షి షా
- ఔషధ నియంత్రణపై విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు
- డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించి వైద్య సేవలను సమీక్షించిన కలెక్టర్ రాజర్షి షా
- మత్తుకు బానిసైన వారికి మెరుగైన కౌన్సెలింగ్ అందించాలని వైద్య సిబ్బందికి సూచన
- ఆరోగ్య సమాజం కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు..





**ఆదిలాబాద్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక ఆరోగ్య వారోత్సవాలు' జిల్లా కేంద్రంలో ఉత్సాహంగా ముగిశాయి. శనివారం స్థానిక రిమ్స్ ఆడిటోరియంలో ఔషధ నియంత్రణ మరియు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. ఔషధ నియంత్రణపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ మరియు ఉపన్యాస పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ మాదకద్రవ్యాలని, వీటిపై విద్యార్థి దశ నుండే సరైన అవగాహన కలిగి ఉండాలని కోరారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అంతకుముందు, కలెక్టర్ రాజర్షి షా రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని 'డీ-అడిక్షన్ సెంటర్'ను ఆకస్మికంగా సందర్శించారు. అక్కడ మత్తు పదార్థాలకు బానిసైన వారికి అందుతున్న చికిత్స విధానాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. నేరుగా రోగులతో మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. మత్తు బారి నుండి బయటపడాలనుకునే వారికి సరైన కౌన్సెలింగ్ మరియు మందులు అందుబాటులో ఉంచాలని వైద్యులను ఆదేశించారు. అంకితభావంతో పనిచేసి వారిని మళ్లీ సాధారణ జీవితంలోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత, ఎస్సై సందీప్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, వైద్య సిబ్బంది, విద్యార్థులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.



# మక్క రైతుకు 'ఆశనిపాతం'

**ముథోల్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం రబీలో మక్క, శనగ, జొన్న సాగు చేయాలని సూచించడంతో నిర్మల్ జిల్లావ్యాప్తంగా రైతులు అధికంగా మొక్కజొన్న వేశారు. దిగుబడులు అధికంగా వస్తాయని సాగు చేసిన వారికి నిరాశే ఎదురవుతున్నది. కనీసం గిట్టుబాటు ధర కూడా దక్కే అవకాశం లేదు. కనీసం అమ్ముకోలేని పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వ మద్దతు ధర రూ.2400 కాగా.. ప్రస్తుత బయట మార్కెట్లో రూ.1600, రూ.1700లకే కొనుగోలు చేస్తుండడంతో క్వింటాలుకు రూ.700ల వరకు రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం మక్కల కొనుగోలు కేంద్రాలు సకాలంలో ఏర్పాటు చేయకపోవడం వల్ల ఈ దుస్థితి దాపురించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కుభీర్‌తోపాటు కుంటాల, తానూర్ వంటి మండలాల్లో సుమారు ఐదు వేల ఎకరాల్లో మొక్కజొన్న కోతలు ప్రారంభమయ్యాయి. పంట చేతికొచ్చి అమ్ముకునేందుకు వ్యాపారుల వద్దకు పరుగులు తీస్తున్నా ఫలితం ఉండడం లేదు.

**ఆశాజనకంగా దిగుబడి..**

నిర్మల్ జిల్లాలో 1,11,567 ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. ఒక్క కుభీర్ మండలంలోనే 15,405 ఎకరాల్లో 5,951 మంది రైతులు సాగు చేశారు. గతేడాది కంటే ఆరు వేల ఎకరాల్లో ఎక్కువ సాగు చేయడం గమనార్హం. ప్రస్తుతం ఎకరాకు 25 నుంచి 30, 35 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నది. గతంలో కంటే పంట ఆశాజనకంగా ఉన్నప్పటికీ ఇటీవల కురిసిన అకాలవర్షాలతో పంట నేలకొరిగింది. దీంతో 20 శాతం దిగుబడులు తగ్గినట్లు రైతులు పేర్కొంటున్నారు. దీనికితోడు ధర మాత్రం అమాంతం పడిపోవడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రభుత్వం మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తేనే రైతుకు మద్దతు ధర దక్కి కొంత మేర ఊపిరి పీల్చుకొనే అవకాశం ఉంది. కాగా.. రైతులు ఎకరాకు రూ.25 వేలు నష్టపోతున్నారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా కోట్లలో నష్టపోవాల్సి వస్తున్నది. మరో పది రోజుల్లో పంట ఎక్కువగా రైతుల చేతికి అందుతుంది. అప్పుడు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ధర మరింత దిగజారే ప్రమా దం ఉంది. ఈ విషయమై మార్క్‌ఫెడ్ డీఎం మహేశ్‌కుమార్‌ను అడుగగా.. జిల్లా వ్యాప్తంగా మక్కల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వానికి నివేదికలను పంపామని, అక్కడి నుంచి ప్రకటన వచ్చిన వెంటనే కొనుగోలు చేస్తామని తెలిపారు.

**రోడ్లపై ఆరబోసిన ధాన్యం సంచులు లూటీ...**

దొంగతనాల్లో ట్రెండ్ మారింది. ఇప్పటివరకు ఇంట్లో ఉన్న తాళం పగలగొట్టి నగదు నగలు, ఇంటిముందు నిలుపుదల చేసిన బైకు, ఒంటరిగా వెళ్తున్న మహిళల మెడలో నుంచి గొలుసు లాక్కోవడం, పాకెట్ కటింగ్ కటింగ్ , దొంగల గురించి విన్న... చూసినం. కానీ ప్రస్తుతం దొంగల ట్రెండ్ మారింది. ఆరుగాలం కష్టపడి పంటలు పండించి పంట కళ్ళల్లో, రోడ్లపై, మైదాన ప్రాంతాల్లో ఆరబోసిన ధాన్యం పంటలు ఎత్తుకెళ్లి దొంగల ముఠా నిర్మల్‌లో కలకలం సృష్టిస్తుంది. వారం రోజుల్లోనే మూడు చోట్ల సుమారు నాలుగు లక్షల విలువచేసే ధాన్యం సంచులు దోపిడి జరగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆ ధాన్యాన్ని దొంగిలించేందు కు సుమారు గంట సమయం పట్టి అవకాశం ఉన్న దొంగలు ఇలాంటి తరహా దొంగతనం పెంచుకొని తప్పించుకోవడం రైతులకు ఆందోళన కలిగిస్తుంది. ఆరుకాలం కష్ట పడి ఎండనక వారానక పంటకు నీరు పెట్టి నూరుపిడి చేసి, పంటను అమ్ముకున్న అం దామని సంచులు నింపితే అవి నడి రాత్రి దోపిడి దొంగలు ధాన్యం సంచులను వాహనాలు ఎక్కించుకొని దోపిడికి పాల్పడం రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. నిర్మల్ జిల్లాలో నిర్మల్, ఖానాపూర్, కుబీర్, ముధోల్, తానూర్, లోకేశ్వరం, సారంగాపూర్ నర్సాపూర్ తదితర మండలంలో వాన కాలం, యాసంగిలో రైతులు సాగుచేసిన మొక్కజొన్న, పసుపు, వరి, జొన్న, మిర్చి, పత్తి తోగల్లు పంటలు ఏవైనా కోసి ఆరబెట్టి అమ్ముకోవడానికి సంచులు నింపితే వాటిని దొంగలు ఎత్తుకెళ్లడం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది.

**పథకం ప్రకారమే దొంగతనాలు..**

నిర్మల్ జిల్లాలో పంటదొంగలు పథకం ప్రకారమే ఇటువంటి చోరీలకు పాల్పడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. సాధారణంగా పంట దొంగతనం చేయాలంటే ధైర్యం, ఆ పంటకు రవాణా చేసే వాహన సదుపా యం, రూట్ మ్యాప్, ఆ ప్రాంతంలో రైతుల కదలికలపై స్పష్టంగా అవగాహన ఉం డాలి. పంట కళ్ళలో బ్యాగులో సంచులు నింపి ఉన్న ధాన్యం తరలించేందుకు సమయం కూడా ఎక్కువగానే పడుతుంది. అయితే దీని పై పూర్తిగా అవగాహన పెంచుకొని నలుగురైదుగురు సభ్యులు గల ముఠాగా ఏర్పడి ఇటువంటి దొంగతనాలు చేస్తున్నట్టు రైతు లు ఆరోపిస్తున్నారు. సాధారణంగా రైతులు పంటను పంటచేల్లో ఆరబోసి ఇంటికి వెళ్తా రు. దీన్ని గమనించిన కొందరు ఆ ముఠా చేతులు కలిపి వాహనాలను సమకూర్చుకొని ధాన్యం సంచులను ఎక్కించుకొని సీసీ కెమెరాలకు చిక్కకుండా రూట్ మ్యాప్‌ను ఎంచుకుంటున్నారు. ఈ ప్రాంతంలో పంట ను విక్రయిస్తే అనుమానం వస్తుందని భావిస్తున్న దొంగలు సుదూర ప్రాంతాలకు పంటను తరలించి అక్కడ నిల్వ ఉంచి తర్వాత విక్రయిస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ముధోల్ నియోజకవర్గంలో కుంటాల కుబీర్, తానూర్, ముధోల్, బాసర, నర్సాపూర్, సారంగాపూర్ తదితర మండలాల్లోని వివిధ గ్రామాలు మహారాష్ట్రకు సరిహ ద్దులు ఉన్నాయి. ఈ ప్రాంతంలోని ఇటువంటి దొంగతనాలు జరుగుతున్నాయి. దోపిడి చేసిన ధాన్యాన్ని ఎంచక్కా మన రాష్ట్రం సరిహద్దు దాటిస్తున్నారు. సరిహద్దు ప్రాంతాల్లో చెక్పోస్టులు ఉన్న అవి నామమాత్రంగా పనిచేస్తున్నాయి. రాత్రి వేళలో పోలీ సులు తనిఖీలు నిర్వహిస్తున్న మొక్క బ్యాగు లు, పత్తి తత్ర పంటలు కావడంతో ఇవి రైతులకు చెందినవిగా వాహనాలను తనిఖీ చేయకుండా పంపిస్తున్నారు.. ఒకవేళ తనిఖీ చేసిన కున్న మొక్కలుగా వారు పోలీసులను నమ్మిస్తున్నారు. ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉన్న అవి కొన్ని ప్రాంతాల్లో పనిచేయ కూడదు పంటదొంగల భాగోతం బయటపడడం లేదు.. ఒకవైపు గుడ్లు. బస్టాండ్లు. వ్యాపార దుకాణాలు. దొంగతనాలు జరుగుతుండగా తాజాగా రైతులు పండించిన దా న్యం లూటీ దొంగలు దోపిడీ చేయడం జిల్లా ప్రజలను ముఖ్యంగా రైతులను ఎంతో ఇబ్బంది కి గురిచేస్తుంది. ఇటువంటి దొంగతనాలు జరగకుండా పోలీస్ శాఖ ఇప్పటికైనా అప్రమత్తంగా ఉండాలి. రైతులు కూడా తమ పంట చేల్లో ఆరబోసిన ధాన్యం వద్దని కాపు కాస్తే పంట రక్షణ ఉంటుంది. ఈ దొంగతనాలు నేతలకు పోలీస్ శాఖ చర్యలు తీసుకు ంటున్న ఇప్పటివరకు జరిగిన దొంగతనాల్లో నేరస్తులను గుర్తించడం లేదు. అయితే దీనిపై జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ప్రత్యేక దృష్టి పెట్టినట్టు పోలీసులు తెలిపారు. సరిహద్దు ప్రాంతాల్లో నిరంతరంగా తనిఖీలు నిర్వహించాలని పోలీసులు చెప్తున్నారు.

**వరుస ఘటనలతో ఆందోళన..**

నిర్మల్ జిల్లాలో రైతులు ఆరు గాలం కష్టపడి పండించిన పంటలు పంటచేల్లో నిలువ ఉంచితే అవి రాత్రికి రాత్రి చోరీ జరుగుతున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. వారం రోజుల క్రితం కుంటాల మండలం కుంటాల కల్లూరు రహదారిపై వెంకురు గ్రామానికి చెందిన రైతు నారాయణ 55 క్వింటాళు ్ల మొక్కజొన్న చోరికి గురైంది. పంటను ఆరబోసి రోడ్డుపై సంచులు నింపి మార్కెట్ తరలిద్దామనుకుంటే రా త్రికి రాత్రి 110 మొక్కజొన్న బ్యాగులను గుర్తు తెలియని దుండగులు వాహనాల్లో ఎక్కించుకొని పారిపోయారు. ప్రస్తుతం మార్కెటల్‌లో క్వింటాలు మార్కెట్లో రూ. 2000 ధర పలుకుతుంది. 55 క్వింటాళ్లు చోరికి గురకగా రైతుకు లక్ష పదివేలు న ష్టం జరిగింది. తాజాగా గురువారం రాత్రి ముధోల్ మండలం విట్టోలి గ్రామానికి చెందిన లక్ష్మణ్ అనే రైతు లో రోడ్డుపై ఆరబోసిన జొన్న 50 బ్యాగులు గురయ్యా యి. ప్రస్తుత మార్కెట్లో జోన్న ధర క్విం టాలుకు 2800 ధర పలుకుతుంది. అం టే సుమారు రూ.1.40 లక్షల విలువచేసి జొన్నలు దోపిడికి గురయ్యాయి. కుబీర్ మండలంలోని ఓ గ్రామంలో 10 రోజుల క్రితం 10 క్వింటాళ్ల ధాన్యం దోపిడికి గురైంది. వానాకాలం సీజన్లో కుంటాల మండలంలోని పూల గ్రామానికి చెందిన రైతులు వేణుగోపాల్, కుమ్మరి దేవన్న కు చెందిన పత్తి ముల్లెలు గుత్తి లేని దుండగులు చోరీ చేసి ఎత్తుకెళ్లిపోయారు. గతం లో కూడా పంటచెర్లో పత్తి మిర్చి కందులు తోగల్లు శనిగలు తదితర పంటలు దొంగతనం చేశారు. నగలు నగదు ఇండ్ల తాళా లు పగలగొట్టి దొంగతనం చేయడం, మహిళా మెడలో నుంచి గొలుసులు లేకపోవడం, జేప్ కటింగ్ వంటి దొంగ తనాలు జరగడం జిల్లాలో తరచుగా జరుగుతున్న ఇప్పుడు ఏకంగా రైతులు కష్టపడి పండించిన పంట దోపిడికి గురి కావడం రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. రైతులు పంటలు సాగు చేసుకునేటప్పుడు దుక్కి దున్ని విత్తనాలు వేసి కలుపు తీసి సస్యరక్షణ చర్యలు చేపట్టి , సేకరించి ఆరబోసి పంటను అమ్ముకొని తమ పంట పెట్టబడును తీసుకుందామనుకున్న రైతులకు ఇటువంటి దొంగతనా లు అసలుకే మోసం చేస్తున్నాయి. ఎండనక వాననక రాత్రి పగలు కుటుంబం మొ త్తం కష్టపడి పంటను సాగు చేస్తే విక్రయించుకున్న సమయంలో ఆ పంట దొంగల పాలు కావడంతో రైతులు కన్నీరు మున్నీరుగా బోధిస్తున్నారు. పంటలకు పెట్టుబ డులు అధిక కావడం మద్దతు ధర లేకు న్నా వ్యవసాయ జీవనాధారంగా బతుకుతున్న జిల్లా రైతు సంఘం పంటపై ఎన్నో ఆశలు పెంచుకొని ఎన్ని కష్టాలు ఎదురైనా పంటలు సాగు చేస్తుండగా ఆ పంటకు ప్రస్తుతం రక్షణ కరువైపోవడంతో లబోదిబోమంటున్నారు.

## రెండు ఆటోలు ఢీ.. ఒకరికి గాయాలు

**మామడ, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**

మండలంలోని న్యూ సాంగ్వి, కప్పన్ పెల్లి ఎక్స్ రోడ్ వద్ద శనివారం రెండు ఆటో లు ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన కథనం ప్రకారం వివరా లు ఇలా ఉన్నాయి. నిర్మల్ నుంచి ఖానాపూర్ వైపు వెళుతుండగా ఆటో, ఎదురు గా వస్తున్న టాటా ఏసీ వాహనాలు ఢీ కొనడంతో ఆటో బోల్తా పడి ప్రమాదం జరిగింది. కడెం మండలం ఎల్లగడప గ్రామానికి చెందిన కొండవేని రాజేశ్వర్ కు తీవ్రమైన గాయాలు కావడంతో 108 ఈఎంటీ సురేష్, పైలెట్ ఆఫీస్‌లు ప్రథమ చికిత్స చేసి అంబులెన్సులో నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

**ఖానాపూర్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ పట్టణంలో 1993-94 ఎస్ఎస్సి బ్యాచ్‌కి చెందిన స్నేహి తులు తమ స్నేహితుడు చుక్కల నారాయణ అనారోగ్యంతో మృతి చెందగా అతని కుటుంబా నికి అప్పటి బ్యాచ్ స్నేహితులు రూ. 30000 ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం నారాయణ స్వగ్రామం కొరిటికల్‌కు వెళ్లి అతని భార్య పిల్లలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో స్నేహితులు అడ్డగడ్డ రమేష్ కుమార్, స్వామి, జోగు శ్రీను, ఆన్ కార్ రవి, బాలేకర్ రంజిత్, అనిల్, సోఫారి గంగాధర్, నడిమట్ల కిషన్, శంకర్, రమేష్ కుమార్‌లు ఉన్నారు.

## లబ్ధిదారులకు కుట్టు మిషన్ల పంపిణీ

**నిర్మల్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**

ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకం కింద లబ్ధిదారులకు మంజూరైన కుట్టు మిషన్లను ఆ పార్టీ నాయకులు శనివారం పంపిణీ చేశారు. దిలావర్‌పూర్ మండలం లోనికాల్వ గ్రామానికి చెందిన నవనీత నరేష్, భార్గవి లక్ష్మణ్ లబ్ధిదా రులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల ఆర్థికాభి వృద్ధి కేంద్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఇటువంటి సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి కామ రాజేశ్వర్ రెడ్డి, నరేష్ రెడ్డి శ్రీకాంత్ ఉన్నారు.



## బాలీవుడ్‌పై వంగ వార్!



రణ్‌వీర్ సింగ్ కథానాయకుడిగా నటించిన స్పై యాక్షన్ డ్రామా `ధురంధర్ ది రివేంజ్` రీసెంట్‌గా విడుదలై ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఆదిత్యధర్ అత్యంత భారీ స్థాయిలో స్పై యూనివర్స్ మూవీస్‌కి షాక్ ఇస్తూ..స్పై మూవీ అంటే ఇదనే అర్థం వచ్చేలా అందరి చేత శభాష్ అనిపించుకుంటూ సంచలనాలు సృష్టిస్తోంది. ఇప్పటికే పలు రికార్డుల్ని తిరగరాసిన `ధురంధర్ 2`పై ప్రముఖులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. మార్చి 19న విడుదలైన ఈ సినిమా ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా రూ.1658 కోట్లు రాబట్టి సరికొత్త రికార్డుల దిశగా పయనిస్తోంది.ఈ మూవీపై సంచలన డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. తనదైన పంథాలో సినిమాపై, రణ్‌వీర్‌సింగ్, దర్శకుడు ఆదిత్యధర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. `బుధవారం రాత్రి `ధురంధర్ 2`ని చూశానని చెప్పిన సందీప్‌రెడ్డి వంగ సినిమా అద్భుతంగా ఉందన్నారు. ఈ సినిమా విషయంలో దర్శకుడు ఆదిత్యధర్, హీరో రణ్‌వీర్ సింగ్‌కు తగిలిన దిష్టి ఊరికే పోదని, గుప్పెడంత మిరపకాయలతోనూ పని కాదని, మొత్తం మిరప తోటనే తగులబెట్టాలని పేర్కొన్నారు.రాజకీయ పార్టీకి `ధురంధర్` చిత్రాలు ప్రచార అస్త్రాలంటూ కొందరు చేసిన ఆరోపణలను ఈ సందర్భంగా సందీప్ ఖండించారు. సత్యాన్ని ప్రచారంగా ముద్రవేయడం ఎప్పుడు మొదలైందో తెలియదన్నారు. రచయితలు, నటులు ప్రచారంతో తమ కెరీర్‌ను నిర్మించుకుంటున్నారు. ఇండస్ట్రీ నిశ్శబ్దంగా ఉండిపోయింది. అలాంటి వారు ఇప్పుడు `ధురంధర్`ను విమర్శిస్తున్నారు. సత్యాన్ని చెప్పడం ప్రాపగండా అనడం వింతగా ఉంది` అంటూ బాలీవుడ్‌కు చేరకలు అంటించారు.ఇదే ఇప్పుడు బాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. `కబీర్‌సింగ్`, యానిమల్ టైమ్‌లో యాంటీగా కొంత మంది సందీప్ రెడ్డి వంగపై ప్రచారం చేశారు. ఇప్పుడు అదే బ్యాచ్ సందీప్ వ్యాఖ్యలపై హాట్ హాట్ చర్చ చేస్తోందట. `ధురంధర్ ది రివేంజ్` మూవీపై సందీప్‌రెడ్డి వంగ చేసిన ట్వీట్ ప్రస్తుతం బాలీవుడ్‌లో ప్రకంపణలు సృష్టిస్తోంది. ప్రాపగండ ఫిల్మ్స్‌తో కొంత మంది రైటర్లు, స్టార్లు తమ కెరీర్‌ని నిర్మించుకున్నారని చేసిన కామెంట్స్ ఇప్పుడు అక్కడ మంట పెడుతున్నాయి.స్టార్ రైటర్స్, బాలీవుడ్‌ని ఇంత కాలం ఏలిన స్టార్స్ ప్రాపగండ స్క్రిప్ట్‌లు, సినిమాలతోనే స్టార్స్, స్టార్ రైటర్స్‌గా ఎదిగారని, కెరీర్‌ని బిల్డ్ చేసుకున్నారని సందీప్ రెడ్డి వంగ చేసిన ఓపెన్ కామెంట్స్ బాలీవుడ్ వర్గాలకు వార్నింగ్ ఇచ్చినట్టుగా ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై నెట్టింట పెద్ద చర్చే జరుగుతోంది. గత కొన్నేళ్లుగా కొంత మంది కావాలనే చరిత్రని వక్రీకరిస్తూ పాఠ్యపుస్తకాల్లో మన చరిత్రని మరుగున పడేసినట్టుగానే మన సంప్రదాయాలని బాలీవుడ్ సినిమాల్లో కావాలనే కించపరుస్తూ కథలు, పాత్రల్ని సృష్టించారని, వాటన్నింటికి `ధురంధర్ 2` చావు దెబ్బ కొట్టిందని, సందీప్ రెడ్డి వంగ చేసిన ట్వీట్ బాలీవుడ్‌లో మరింత మంటపెడుతోందని నెటిజన్‌లు చర్చించుకుంటున్నారు.



## ఓటీటీలోకి 'ఉస్తాద్ భగత్ సింగ్'

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని ఫిక్స్ చేసుకుంది. ఏప్రిల్ 16 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. గతంలో దీని స్ట్రీమింగ్‌కు సంబంధించి ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ తాజాగా నెట్‌ఫ్లిక్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది దేవిశ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో పవన్‌కు జోడీగా రాశీఖన్నా, శ్రీలీల నటించారు.నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడికి పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవికుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలి పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ (పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు? అన్నది చిత్ర కథ.

## పూజా హెగ్డే సినిమా ప్రీపోన్!

ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్ని అలరించే కథానాయిక పూజా హెగ్డే.. హిట్ మాట వినిపించి చాలా రోజులయ్యింది. గతేడాది 'దేవా', 'రెట్రో' లాంటి చిత్రాలతో తెరపైకి వచ్చినా.. ఆశించిన ఫలితాన్ని అందుకోలేదు. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'హై జవానీతో ఇష్క్ హోనా హై' చిత్రముంది. బాలీవుడ్ కథానాయకుడు వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్న చిత్రమిది. ఈ ప్రేమకథకు డేవిడ్ ధావన్ దర్శకత్వం వహిస్తున్నారు. మృణాల్ ఠాకూర్ మరో నాయిక. ఈ చిత్రాన్ని జూన్ 12న థియేటర్లలోకి తీసురాబోతున్నట్లు ఇప్పటికే ప్రకటించింది చిత్రబృందం. ఇప్పుడు దీన్ని అనుకున్న తేదీ కన్నా మూడు వారాల ముందుగానే అంటే మే 22న విడుదల చేయనున్నారట. వేసవి సెలవులు, కుటుంబ ప్రేక్షకుల్ని దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన రానుందని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.



# పీడనపై ధిక్కారస్వరం పూలే జీవితం

**మంచిర్యాల, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)** బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి, చైతన్య దీప్తి మహాత్మజ్యోతి బాపూలే 199 జయంతిని శనివారం బీసీ రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక పూలే భవన్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ' బీసీ వాదం సాహిత్యం రాజకీయాలు' అనే అంశం మీద ప్రసిద్ధ సామాజిక విశ్లేషకులు రంగు రాజేశం, ప్రముఖ కవి తోకల రాజేశం ప్రసంగించారు. మంచిర్యాల జిల్లాలో కవులు రచయితలు ఆయా సందర్భాలకు అనుగుణంగా బేసి స్పృహను ప్రదర్శించిన సందర్భాలను ఉదాహరణలతో సహా వివరించారు. జిల్లా సాహితీ రంగంలో బీసీ వాదం బలంగా ఉందని, రాజకీయాల్లో కూడా బీసీలకు సముచితమైన స్థానం కల్పించాలని కోరారు. పూలే జీవితం మనందరికీ ఆదర్శనీయమని వాళ్లు కొనియాడారు. బీసీ రచయితల సమాఖ్య జిల్లా కన్వీనర్ గోపగాని రవీందర్ తో పాటుగా ప్రసిద్ధ రచయితలు, కవులు నాగవర ముత్యం, అల్లాడి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, గోపగాని రమణశ్రీ,, చంద్రమోహన్, ప్రకాష్, ఎస్ కొండయ్య, మల్లయ్య, టి. పోచయ్య, రాజేశం గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.




## మొక్కజొన్న పంటను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలి


**నిర్మల్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)** రబీ సీజన్ లో రైతులు పండించిన మొక్కజొన్నను ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్ధతు ధరను పొందాలని నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి అన్నారు. శనివారం మార్కెట్ యార్డులో రైతులకు టోకెన్లను జారీ చేశారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు వ్యవసాయ శాఖ మంత్రికి విన్నవించగా నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్నలు విక్రయించి క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర పొందాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రైతుల సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు.

## ఇచ్చోడలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి

**ఇచ్చోడ, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)** బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఇచ్చోడ మండల కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఇన్చార్జి అన్నెల లక్ష్మణ్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే సామాజిక సంస్కర్త, అంటరానితనం, కుల వివక్ష పై అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అని బడుగు బలహీన వర్గాలకై పరితపించిన ఉద్యమకారుడు మహిళా విద్యా మార్గదర్శకుడు మహాత్మా శ్రీ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. బీసీ జేఏసీ ఇచ్చోడ మండల ప్రధాన కార్యదర్శి పిల్లి నరేష్ మాట్లాడుతూ బలహీనవర్గాల దీన జన బాంధవుడు, సమ సమాజ నిర్మాణ కృషివలుడు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి ప్రదాత అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సామాన్ పెల్లి సుదర్శన్ కృష్ణ యాదవ్ దత్తు అంబేకర్ పాండురంగ్ మరియు గ్రామ అభివృద్ధి కమిటీ ఇచ్చోడ ప్రధాన కార్యదర్శి రేణిగుంట సురేష్, పొనకంటి ఆశన్న,కొత్తూరు లక్ష్మణ్ పాల్గొన్నారు.



# వేమనపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం



## ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి

**వేమనపల్లి, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)** ప్రజలందరితో కలిసి ఉంటూ వేమనపల్లి మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. శనివారం ఆయన మండలంలోని సూరారం గ్రామపంచాయతీ నూతన భవనాన్ని సర్పంచ్ చిడం శ్రీలతతో కలిసి ప్రారంభించారు. అనంతరం నాగారం గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని సర్పంచ్ ముల్కల శ్రీలతతో కలిసి ప్రారంభించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఎప్పుడైనా ప్రజలు నేరుగా తనను కలవచ్చని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తనకు ఎలాంటి వ్యక్తిగత ఆశలు లేవని, ప్రజలతో కలిసి ఉండి గ్రామాలను మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. ఇప్పటికే మండలానికి అనేక బోరు వెల్ పంపులను ఏర్పాటు చేశామని తెలిపారు. ముత్తాపూర్ నుండి వేమనపల్లి వరకు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. త్వరలోనే పోడు భూముల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సుంపుటం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అటవీ శాఖ అధికారులు అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆ గ్రామం పూర్తిగా అటవీ భూమిలో ఉండటంతో అధికారులు ఆంక్షలు విధిస్తున్నారని తెలిపారు. ఈ సమస్యను త్వరలోనే మంత్రితో మాట్లాడి పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే బెల్లంపల్లి నుంచి వేమనపల్లి, చెన్నూరు వరకు ఆర్టీసీ రింగు బస్సు నడిపేందుకు డిపో మేనేజర్‌తో మాట్లాడుతానని తెలిపారు. ఈ సందర్భంగా 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రుద్రపట్ల సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సాబీర్ అలీ, డీసీసీ జనరల్ సెక్రటరీ గాలి మధు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు చెన్నూరి సమ్మయ్య, సర్పంచులు ఉప్పలపు సాయికృష్ణ, ఆలం లక్ష్మణ్, దుర్గం భాగ్యలక్ష్మి, మడే శ్రీనివాస్, కొట్రంగి శ్రీనివాస్, ఆవులమారి పున్నం, అయిల్లా శ్రీనివాస్ రెడ్డి, కొండి మానస, ఎనగంటి మల్లీశ్వరి, మాజీ ఎంపీపీ కుర్రు వెంకటేశం, ఎంపీడీఓ కుమారస్వామి, ఎంపీఓ వెంకటేష్, నాయబ్ తహసీల్దార్ సాయికృష్ణ, ఆర్ఐ ఖాలిక్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, సంతోష్ రెడ్డి, మాజీ సర్పంచులు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

**తాండూర్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)** ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని బీఆర్టీయూ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు ఎండీ హబీబ్ పాషా ఆరోపించారు. శనివారం తాండూర్ మండల కేంద్రం ఐబీలో మండల ఆటో యూనియన్ సహకారంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా ఐదు లక్షల రూపాయల పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందనఇ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం వల్ల ఆర్థిక ఇబ్బందులతో ఇప్పటివరకు 120 మంది



ఆటో కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. చనిపోయిన ఆటో డ్రైవర్ల కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.



## ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కరించండి

**నిర్మల్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)** నిర్మల్ జిల్లాలో ఆర్టిజన్ కార్మికులు, ఫీజు వర్క్ కార్మికులు, ఒప్పంద కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న సమ్మె శనివారం నాటికి మూడు రోజులకు చేరుకుంది. డిఈ కార్యాలయం ముందు ఈ సమ్మె నిర్వహిస్తున్నారు. సర్వీసులు అమలు చేయాలని, ఒప్పంద కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని, తదితర డిమాండ్లతో ఈ సమ్మె చేయడం జరుగుతుందన్నారు, ఈ కార్యక్రమంలో నాయకులు నిరంజన్ రెడ్డి రాజు బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు శ్రీధర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

## మొక్కజొన్న కొనుగోలు చేపట్టాలి

**ముథోల్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)** ముధోల్ అసెంబ్లీతో పాటు కుంటాల మండల కేంద్రంలో ఇటీవలే కురిసిన వర్షానికి గాలి దుమారానికి చేతికి వచ్చిన పంట నెల పాలు అవుతున్న వెంటనే కొనుగోలు ప్రారంభించాలని మార్కెడ్ ఎండీ శ్రీనివాస్ రెడ్డికి విన్నవించినట్టు మాజీ ఎంపీపీ రమణ రావు సర్పంచ్ జక్కుల గజేందర్ తెలిపారు. రైతుల కష్టాన్నీ దృష్టిలో పెట్టుకొని త్వరగా మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, అలాగే లింబా తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలతో పాటు జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని కోరారు. దీనికి ఎండీ సానుకూలంగా స్పందిస్తూ సంబంధింత అధికారులతో మాట్లాడి తగినన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తావని వివరించారు.



## తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

**వాంకిడి, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)** మండలంలోని బంబార గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సర్పంచ్ బెండరే కృష్ణాజి ముందుచూపుతో చర్యలు చేపట్టారు. శనివారం సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామం లోని బోరు మరమ్మత్తు పను లు నిర్వహించి, ప్రజలకు నీటి సరఫరా అంతరాయం కలగ కుండా చూసుకున్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ముందుగానే సమస్యలను గుర్తించి పరిష్కరించడం పట్ల గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో ప్రతి ఇంటికి తగినంత తాగునీరు అందేలా అవసరమైన ఏర్పా ట్లు చేస్తున్నట్లు సర్పంచ్ తెలి పారు. ప్రజలు కూడా నీటిని ఆదా చేస్తూ సహకరించాలన్నారు.



### ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణకు

# సర్వం సిద్ధం చేయండి





- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా
- ఏప్రిల్ 20న నిర్వహించే సంస్మరణ దినోత్సవంపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి
- అమరవీరుల స్తూపం వద్ద జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్
- భక్తులు, ఆదివాసీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు
- చారిత్రక ప్రాధాన్యత కలిగిన వేడుకను ఘనంగా నిర్వహిస్తామన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ఇంద్రవెల్లి, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం):** చారిత్రక ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఈ నెల 20న అత్యంత భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. ఈ నేపథ్యంలో శనివారం ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక స్తూపాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను వారు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. ఏప్రిల్ 20న ఉమ్మడి జిల్లా నలుమూలల నుండి వేలాదిగా తరలివచ్చే ఆదివాసీలు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చలువ పందిళ్లు, తగినన్ని నీటి వసతులు కల్పించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారిని గౌరవించుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఈ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం బందోబస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆదివాసీల ఆచార వ్యవహారాలకు భంగం కలగకుండా ప్రభుత్వం తరపున అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐటీడీఏ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నిర్మల్‌లో ‘వారసత్వ సంబురాలు’ అమోఘం



- ముఖ్య అతిథిగా మాజీ ఎన్నికల కమిషనర్ పార్థసారథి
- ఉమ్మడి జిల్లా సంస్కృతి, వైద్య వృత్తిపై రచయితల కలం కవాతు
- సాహిత్య సృజనలో మహిళలు ముందుండటం గర్వకారణం
- జిల్లా వైద్యులకు ఘన సన్మానం - అలరించిన సాంస్కృతిక విశేషాలు.
- జోరుగా పుస్తకావిష్కరణల పండగ - తరలివచ్చిన మేధావులు, కళాకారులు

**నిర్మల్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని సిటీ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ‘వారసత్వ సంబురాలు’ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, వైద్య వృత్తి, సంస్కృతి, సాంప్రదాయాలపై జిల్లా రచయితలు రచించిన పలు పుస్తకాలను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. జిల్లాలో రచయితలు విశేషంగా సాహిత్య సృష్టి చేస్తున్నారని, ముఖ్యంగా మహిళా రచయితలు ముందుకు రావడం గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం వైద్యులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా వైద్యులు, కార్యక్రమ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులు కావలెను
ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్
తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక
9440977660, 9110718194
PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY



### బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# మహాత్మా పూలే జయంతి

- సామాజిక స్ఫూర్తిప్రదాత పూలేకు ఘన నివాళి
- అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి
- విద్యా సాధికారతే ఆయనకు ఇచ్చే అసలైన గౌరవమని కొనియాడిన ప్రముఖులు

**ఉట్నూర్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**

జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతిని న్యాయవాదులు నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బార్ అధ్యక్షులు బానోత్ జగన్ నాయక్ మాట్లాడుతూ సమాజంలో అనగారిన వర్గాల ప్రజలకు విద్య అందించదానికి పాఠశాల ఏర్పాటు చేయడటంతో పాటు కుల నిర్మూలన బాల్య వివాహాల కోసం పోరాడిన మహనీయులని అన్నారు. పూలే ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పవార్ వసంత్ రావు ప్రధాన కార్యదర్శి బి. జైవంత్ రావు జాయింట్ సెక్రటరీ కుడెల్లి అశోక్ లైబ్రరీ సెక్రటరీ జాదవ్ విశాల్ స్పోర్ట్స్ సెక్రటరీ నునవత్ వినోద్ న్యాయవాదులు పెందూర్ ప్రభాకర్ నాతరి రాజు మానాల లక్ష్మీనారాయణ అజహార్ తదితరులు పాల్గొన్నారు.

# తలకు దెబ్బ తగిలి విద్యార్థి మృతి

### గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 11 (ప్రభాత సమాచారం)**

జైనూర్ మండలంలోని పానపటార్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం 4వ తరగతి చదువుతున్న విద్యార్థి దుర్వా అన్వేష్ మృతి చెందిన ఘటనపై గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి శనివారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. వార్షిక పరీక్షల నేపథ్యంలో ఉదయం విద్యార్థులు పరీక్షలు రాసి హాస్టల్‌కు వచ్చారు. భోజనం అనంతరం కొందరు పిల్లలు మంచాలకు ఊయల కట్టి ఊగుతున్నారు. అన్వేష్ కూడా ఊయల పై ఎక్కి ఊగుతుండగా, ఊయల నుంచి కిందపడి సమీపంలోని ఇనుప పెట్టె పై పడటంతో అతనికి తలకు తీవ్ర గాయమైందన్నారు. విషయాన్ని గమనించిన సిబ్బంది జైనూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. వైద్యులు చికిత్స ప్రారంభించేలోపే అతను మృతి చెందినట్లు తెలిపారు. విద్యార్థి అంత్యక్రియలకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు, అతని తండ్రికి పార్ట్‌టైమ్ ఉద్యోగం కల్పిస్తామని తెలిపారు.